పంచరత్నాలు

రామకిష్టయ్యది అదృష్టం! అయిదుగురు కొడుకులు. ఆడపిల్లలు లేరు. ఇంకేం కావాలి? ఈ రోజుల్లో ఆడపిల్లంటే మూటంబేస్తు, మగపిల్లవాడు జాక్‌పాట్.

దేవుడు కొందరికి పొలాలిస్తాడు. కొందరికి మగపిల్లల్నిస్తాడు. ఈ దేశానికి కావలసింది సంతాన నిరోధం కాదు. స్త్రీ సంతాన నిరోధం. ఆడపిల్లల సంఖ్య మగ వాళ్ళ సంఖ్యతో సమంగా ఉంటేనే మగపిల్లలు గాలిపటాల్లాగా ఆకాశాన ఆడు తున్నారు. ఆడపిల్లల సంఖ్య సగానికి తగ్గిందంటే ఇక మగపిల్లల తండ్రులకు వేరే ఆస్తులూ, ఉద్యోగాలూ దేనికి?

మగపిల్లలంటే అమ్మకం పన్నులేని కార్గో! బ్లాక్‌మనీ! దాచిన బంగారం.

రామకిష్టయ్యకు కావలసిన వాళ్ళమంతా ఈ ధోరణిలోనే ఆలోచించి ఎంత గానో అసూయపడ్డాం. ఆయనకూడా తన కొడుకులను పందెపుగుర్రాల్లాగా తయారు చేస్తూ వచ్చినది, వాళ్ళు తనలాగా బడిపంతులు బతుకు బతకరాదనే అనుకుంటాను.

మనుషులకు ఎన్నో దాహాలు. రామకిష్టయ్యకు విద్యా దాహం జాస్తి. ఇప్ప టికీ అయిదు నిమిషాలు ఖాళీ దొరికితే ఏదో ఒక పుస్తకం తిరగేస్తాడు. పాతిక సంవత్సరాలుగా పిల్లలకు పాఠాలు చెబుతున్నా ఆయనకు పుస్తకాలంటే మోహం మొత్తకపోవటం ఆశ్చర్యం.

అపరిపక్వంగా నిలిచిపోయిన ప్రేమలే అమరప్రేమలు. రామకిష్టయ్య విద్యా దాహం విద్యార్థి దశలో తీరలేదు. ఆయన ఇంటరుతో చదువు కట్టిపెట్టవలసి వచ్చింది. ఎందుకంటే, అప్పటికే ఆయన తండ్రి-రెండెకరాల భూస్వామి; ప్లీడరు గుమాస్తా-ఇద్దరాడపిల్లలకు పెళ్ళిచేసి, శకునితో పాచికలాడిన ధర్మరాజులాగా తయా రయాడు. ఎంత చెడ్డా ప్లీడరు గుమాస్తా గనక కట్టుబట్టలతో అరణ్యాలు పట్టి పోలేదు. "అబ్బి నాతోపాటు నువుకూడా నాలుగురాళ్ళు తెస్తేనేగాని ఈ బండి నడ వదురా?" అని కొడుకును హెచ్చరించాడు.

రామకిష్టయ్య ట్రైనింగు చదివి, రెండు మూడు మిడిల్ స్కూళ్ళలో హెడ్ మాష్టరుగిరీ చేసి, చివరకు హైస్కూలులో మూడోఫారం బీ సెక్షనుకు క్లాసు టీచరుగా స్థిరపడ్డాడు. తన పేరు చివర "ఎం ఏ." తగిలించుకునే అవకాశం పోయిందన్న విచారం పోయింది. ఇరవై రెండో ఏటనే తాను తన యాభై ఏళ్ళ తండ్రికన్న హెచ్చు సంపాదిస్తున్న తృప్తి మిగిలింది.

కాని రామకిష్టయ్యలో ఉన్నత విద్యా వ్యామోహం ఏ మాత్రం చావలేదు.

జ్ఞానం సంపాదించాలంటే కాలేజీల్లోనే చదవనవసరం లేదు. మంచి మంచి పుస్తకాలున్నాయి. ఆయన వాటిని మథించేవాడు. స్కూలు స్టాఫ్‌లో ఎవరికి అనుమానం వచ్చినా రామకిష్టయ్య నడిగేవాళ్ళు. కాలేజీ చదువుల్లో కొద్ది విషయాలే చెబుతారు. రామకిష్టయ్య అన్ని విషయాలను గురించీ చదివాడు. అసూయగ్రస్తులాయన్ని పుస్తకప్పురుగనే వాళ్ళు.

థర్డుఫారం క్లాసుటీచరుగా స్థిరపడ్డాక, రామకిష్టయ్యకు కొడుకులు పుట్టుకొచ్చారు. తొలిచూలు బిడ్డ ఇంకా పురిటి గదిలో ఉండగానే, వాడు డాక్టరేట్ సంపాదించటానికి పథకం ఆలోచించసాగాడు రామకిష్టయ్య. పుస్తక పఠనంలోను, దాంపత్య సుఖంలోనూ కూడా దొరకని నిరంతరానందం ఆయనకు ఈ పథకాలు వెయ్యటంలో— పగటి కలలు కనటంలో— లభ్యమయింది.

మంచి సిమెంటురోడ్డు ఒక్కసారే వేస్తారు. తీవ్రమైన కృషి అంతా అప్పుడే జరుగుతుంది. అటు తరువాత, దానిమీద మొదటి వాహనం వెళ్ళాక, ఎన్నివేల వాహనాలైనా వెళ్ళొచ్చు. అదే విధంగా, రామకిష్టయ్య తన పెద్దకొడుకు కోసం పథకాలు వెయ్యటంలో బుర్ర పగలగొట్టుకున్నట్టు మిగిలిన కొడుకులకోసం బాధ పడలేదు.

2

ఏకాగ్రత గలవాడు స్వార్థపరుడిలాగ కనిపిస్తాడు. చుట్టుపక్కలవాళ్ళ విమర్శలకు గురి అవుతాడు. తపస్సమాధిలో ఉన్న ముని తనను లక్ష్యపెట్టలేదని పరీక్షిత్తుకు ఆగ్రహం రావటం మనకు తెలిసినదే గద!

రామకిష్టయ్యను మా బంధువర్గం ఏమంత మెచ్చలేదు. ఒంటికంటి రామలింగమనీ, ఉలిపికట్టె అనీ రకరకాల పేర్లు పెట్టారు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్ళున్నారు. వాళ్ళకు పిల్లలున్నారు. పిల్లాపీచూ, సంసారము ఉన్నవాళ్ళకు కష్టాలొస్తాయి. వాళ్ళ కష్టసుఖాలు పంచుకోవటం తన విధి అన్నట్టుగా ఆయన ఏనాడూ ప్రవర్తించలేదు.

తన అత్తవారివైపు వాళ్ళపట్ల కూడా అంటీ అంటనట్టే ఉండిపోయాడు.

ఇంకెందుకూ తెలివితేటలు లేకపోయినా అవతలివాణ్ణి విమర్శించడంలో బంగారాన్ని తూచినట్టుగా తూచగలవాళ్ళు ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. అటువంటివాళ్ళు రామకిష్టయ్యను చాలా సూక్ష్మంగా విమర్శించారు— "బావమరిది పెద్ద కూతురి పెళ్ళి తాను వెళ్ళకుండా తన భార్యనూ పిల్లల్నీ మాత్రమే పంపాడంటే పోనీలే అనుకోవచ్చు. తన చెల్లెలి బావగారు కాలంచేస్తే వెళ్ళి చూడక పోవటం ఎంత తప్పు!"

ఇటువంటి తప్పులు రామకిష్టయ్య తలవెంట్రుకలన్ని చేశాడు.

"బాధ్యతలేని మనిషి!" అన్నారు.

"ఎప్పుడు కాకపోతే మానె, పండగలకీ, పబ్బాలకీ చెల్లెళ్ళను పిలుచుకోరు; మేనల్లుళ్ళకూ, మేనగోడళ్ళకూ దోచిపెట్టే వాళ్ళున్నారే!" అనేవాళ్ళు అడంగులైన బంధువులు.

ఇటువంటి విమర్శలు రామకిష్టయ్యకు హాస్యాస్పదంగా ఉండేవి. వాళ్ళ ఆచారాలూ బాధ్యతలూ అనేవి ఏనాడో గతించిన కాలం నాటివి. ఆటవిక ఆచారాలు! మ్యాట్రియార్కీ! జీవితానికి ఒక లక్ష్యమూ, అర్థమూ లేకుండా పొలాలమీద తేరగా వచ్చినది మేస్తూ రికామీగా ఉండేవాళ్ళు ఈ ఆచారాలనూ, మర్యాదలనూ, బాధ్యతలనూ అమలు చేస్తున్నారు. ఈ శషభిషలు తన దగ్గిర సాగవు.

రామకిష్టయ్యలో ఉన్న ఒక్క సుగుణమేమంటే, తనకు చిన్నమెత్తు ఉపకారం చెయ్యలేని వాళ్ళూ, చెయ్యదలచిన వాళ్ళూ తనను గురించి ఎంత చెడ్డగా మాట్లాడినా ఏమాత్రమూ చలించేవాడు కాడు. వాళ్ళు తనను గురించి నిజం బయట పెట్టడంకన్నా తమను గురించే ఎక్కువ నిజం బయట పెట్టుకుంటున్నారని తృప్తి పడేవాడు. ఈ ఒక్క గుణమూ అందరిలోనూ ఉంటే. బతికేపోదుము!

ఈ ఛిద్రాలన్నీ పట్టించుకోవటానికి రామకిష్టయ్యకు టైములేదు, ఓపికాలేదు. అతను చెయ్యవలసింది ఎంతైనా ఉంది. తాను నిర్మించనున్న భవంతి చాలా పెద్దది. అది తనవల్ల అవుతుందో, కాదో దేవుడెరుగు. కాని అందుకు లోతైన పునాదులు తవ్వటం, తన విధి. పునాదులు మాత్రమే లేచి బేస్‌మెంటు దగ్గర ఆగిపోయిన ఇళ్ళు ఎన్ని లేవు?

స్కూలువాళ్ళు తనకిచ్చే జీతం చాలదు. పెద్దవాడి పుటకలకు తండ్రికూడా పోయాడు. రాఘవుడు తాతగండాన పుట్టాడన్నారు. అటువంటి మూఢవిశ్వాసాలు రామకిష్టయ్య సహించేవాడుకాడు.

"ఒక విధిని నమ్ము! లేదా గ్రహాలను నమ్ము! అంతేగాని, తుమ్ములూ, శకునాలూ, చేతబళ్ళూ, దొడ్లో మొక్కలూ, బల్లిపలుకులూ, దేవుళ్ళకు ముడుపులూ, మంత్రోపాసనలూ, తాయెత్తులూ, సాయిబాబాలూ, ఇంకో బాబాలూ— నీ జీవితాన్ని ఇన్నీ శాసిస్తున్నాయనుకుంటే మనిషిగా పుట్టటంకన్నా అడవిలో మానుగా పుట్టటం మేలు?" అనే వాడాయన.

"నువు దేన్ని నమ్ముతావు?" అని ఒకసారి ఎవరో అడిగారు.

"ప్రకృతి ధర్మాన్ని. ఎటుచూసినా నాకదే కనిపిస్తున్నది" అన్నాడు రామకిష్టయ్య. నామటుకు నేనామాట మెచ్చాను. అంతవరకు రామకిష్టయ్య పూరా ఆధునికుడే.

వచ్చేజీతం చాలదనేకన్నా తగినంతగా మిగలదనాలి. ఎందుకంటే ఆరోజుల్లో రామకిష్టయ్య సంసారంలాటిది ముప్ఫై రూపాయలతో హాయిగా వెళ్ళిపోయేది!

అంతకు మూడింతలు జీతం వస్తూనే ఉన్నది. అందులో బీమా పాలసీ ఒకటి తీసుకున్నాడు. పదిహేనేళ్ళమీద అయిదు వేలకి. రాఘవుడు బి. ఏ. పాసయ్యేలోపలే ఆ డబ్బు చేతికి వస్తుంది. కావలిస్తే దానితో వాడిని పై దేశాలకు కూడా పంపవచ్చు. మోతీలాల్ నెహ్రూ[1] తన కొడుకును[2] ఇంగ్లండు పంపించటం ఒక గొప్ప సంగతికాదు. బడిపంతులు రామకిష్టయ్య తన కొడుకును పంపటం చాలా ఘనమైన సంగతి.

రామకిష్టయ్య ట్యూషన్‌లు కూడా తీసుకున్నాడు. స్కూలు పిల్లలకు తనక్లాసు పిల్లలకు ట్యూషన్‌లు చెప్పటం కాదు - అందుకు కమిటీవాళ్ళ పరిమిషన్లు, వచ్చి ఖర్చులు కావాలని రూలు పెట్టారు. కొందరు సంపన్నుల బిడ్డలు చదువు సంధ్యలు లేకుండా జులాయిగా తిరిగి, తీరా పెళ్ళికి ముందు, "మావాడు మెట్రిక్ చదువుతున్నాడు!" అని చెప్పుకునేందుకు ట్యూషన్‌లు చెప్పించి మూడో ఫారంలోనో, నాలుగో ఫారంలోనో చేరుస్తారు. వాళ్ళ డబ్బుకూడా బాగా యిస్తారు.

రామకిష్టయ్యది సుఖము విశ్రాంతి కోరే తత్వంకాదు. అమెరికాలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లకు కాలం విలవ ఎంతబాగా తెలుసునో రామకిష్టయ్యకూ అంతబాగానూ తెలుసు.

"ఎందుకండి ఊరికే పనులు అట్లా మీదేసుకొంటారు?" అనేది రామకిష్టయ్య భార్య.

రామకిష్టయ్య వరలక్ష్మమ్మ కేసి వింతగా చూసి "ఇంతకు రెట్టింపు పని చేయగలను. పని చూపించు?" అనేవాడు. ఆయన పనిలేక కొట్టుకుంటున్నాడనికాదు. క్షణం తీరిక దొరికితే పుస్తకాలు చదివేవాడు. ఆయనకు కావలసింది డబ్బొచ్చేపని

ఒకసారి "భారతి"లో ఏదో వ్యాసం పడింది. అటువంటి వ్యాసాలు తను కూడా వ్రాయవచ్చనిపించింది రామకిష్టయ్యకు. బమ్మెరపోతనామాత్యుని కథా కథన శక్తిని గురించి వ్యాసం వ్రాసి పంపాడు. అది అచ్చయ్యింది. ఆ పైమాసం దానికి ప్రతిఫలం కూడా ముట్టింది.

"సంపాదనకు ఇదొక మార్గం కూడా ఉందన్నమాట!" అనుకొని రామకిష్టయ్య తృప్తిపడ్డాడు.

---

1. మోతీలాల్ నెహ్రూ (1864-1954) : ప్రముఖ న్యాయవాది; జాతీయోద్యమ నిర్మాతల్లో ఒకరు.
2. జవహర్‌లాల్ నెహ్రూ (1889-1964); మే 1905 నుండి 1912 వసంతందాకా యేడేండ్లపాటు యింగ్లండులోని హారో, కేంబ్రిడ్జిలలో సాగిన చదువు ప్రస్తావన.

3

పిల్లలు ఎదిగివస్తున్నారు. అయిదు 'పెట్టెలరైలు. పెట్టెలన్నీ ఒక్కసారి కదలవు. ఒకదాని తరువాత ఒకటి కదులుతుంది. ఈ రైలుకు తానే పట్టాలు వేశాడు. తానే ఇంజను కూడాను. మొదటి పెట్టెను లాగేవరకే ఇంజను పని. మిగిలినవి ఒకదాని వెనుక ఒకటిగా అవే వస్తాయి.

అందుకని రామకిష్టయ్య తన దృష్టినంతా రాఘవుడి మీదనే కేంద్రీకరించాడు. అందుకు మరొక కారణం కూడా ఉన్నది. రాఘవుడు ముమ్మూర్తులా తండ్రి పోలికే. కాకపోతే సాత్వికుడు. చొరవ తక్కువ,అయినా ఫరవాలేదు. వాణ్ణి ముందుకు నెట్టేపని తాను చూసుకుంటాడు.

రాఘవుడు చిన్నతనంలో విచిత్రంగానే ఉండేవాడు. ఏ పనిగాని ఎవరన్నా చెయ్యమనేదాకా చేసేవాడుకాడు. ఆఖరుకు తల్లి కంచంలో అన్నంపెట్టి "తినవేంరా" అంటే అప్పుడు తినేవాడు. వాడిలో స్వతంత్రంగా ఆలోచించి ఏదైనా చేసే శక్తి బొత్తిగా లేనట్లుండేది. దానికి కారణం రామకిష్టయ్యేనని నా అనుమానం. తాను వేసిన పట్టాలమీదినుంచి ఎక్కడ దిగిపోతాడోనని ఆయన అడుగు అడుగున వాడికి ఏం చేయాలో చెప్పేవాడనుకొంటాను.

లేక రాఘవుడి పుటక తీరే అంతో !

రామకిష్టయ్యగారి పిల్లలు ఆయన దృష్టిలో రైలుపెట్టెలైతే కావచ్చు కాని, అన్నీ ఒకరకం పెట్టెలు మటుకుకావు. పిల్లలందరు ఒక తాటిమీద నడవరని దూరాన్నుంచి చూసిన మావంటి వాళ్ళకు మొదటినుంచీ అనిపించింది.

పెద్దవాడు ఒట్టిమేక - తెలివైన మేక అనుకుందాం. వాడిది మేషలగ్నమైతే రెండవ వాడిది మకర లగ్నం. వాడిది మొసలి పట్టు. వాడి పేరు రామ్మూర్తి. మూడవ వాడికి సరిపడే రాశి యేమిటో నాకే తెలీదు. కర్కాటక లగ్నమేమో. వాడు ఎవరినీ నమ్మేవాడుకాడు. అందరూ తనతో అబద్ధాలాడుతున్నారన్నట్లుగా ప్రవర్తించేవాడు. తల్లి మిఠాయి పెడతానన్నాసరే "అబద్ధాలు! మిఠాయి ఎక్కడిది? ఎవరిచ్చారు?" అని ప్రశ్నించేవాడు. వాడిలో చిన్నపిల్లవాడి లక్షణాలు నేనేనాడూ చూడలేదు. ఆ మాటని చాలా గొప్ప బుర్ర అంటే అదీ లేదు. ఇప్పుడు అప్పగించిన పాఠం ఇంకాస్సేపటికి మరచిపోయేవాడు.

ఈ మూడోవాడు, నారాయణ, తండ్రిచేత తిన్న దెబ్బలు మరెవరు తినలేదు. అ ఆ లు రాసిస్తే అవి అ ఆ లు కాదనేవాడు. తన్నులు తినేవాడు.

నాలుగోవాడు కోదండరాముడు. పై ముగ్గురికన్నా తెలివి గలవాడని నా నమ్మకం. అయితే అవి పైకి కనిపించే తెలివితేటలు కావు. చాలా మితభాషి. మనుష్యలను చాలా త్వరగా అర్థం చేసుకొనేవాడు.

అయిదోవాడు గోవిందం. నాలుగోవాడంత తెలివిగలవా డవునో కాడో కాని చాకులాంటి మనిషి. మాటలతో నెగ్గుకొచ్చేవాడు. వాడిని మోసపుచ్చటం చాలా కష్టమయ్యేది.

ఈ అన్నదమ్ముల మధ్య రెండేసీ మూడేసీ ఏళ్ళు తేడా ఉండేది.

తండ్రిచేత మాటపడకుండా వుండటానికయితేనేం, తండ్రి తనకోసం వేసిన పట్టాలమీద గురివల్లనైతేనేం రాఘవుడు ప్రతిక్లాసు చాలా శ్రద్ధగా చదివి మంచిమార్కులతో పాసవుతూ వచ్చాడు. ఇంటరులో వాడికి చాలామంచి మార్కులు వచ్చాయి. వాడికి కాబోయే బావమరిది ఇంటరులో వాడికి క్లాసుమేటు కూడా కావటం తటస్థించింది. సాధారణంగా క్లాసులో మంచి తెలివిగల వాళ్ళనిపించు కొనేవాళ్ళు ఒకటవుతారు. రాఘవుడికి, శివానందానికి మంచి స్నేహం కూడా ఏర్పడింది.

శివానందం అన్న పెళ్ళైతే రాఘవుణ్ణి బలవంతం చేసి తీసుకుపోయాడు. పెళ్ళి బెజవాడలో. శివానందం తల్లీ తండ్రీ రాఘవుణ్ని దగ్గర బంధువుని చూసినట్లే చూశారు. రాఘవుణ్ని శివానందం వెంటపెట్టుకుపోయింది సగం వాళ్ళు చూడటా నికే. అంతకుమునుపే ఆ కుర్రవాడు రాఘవుణ్ని గురించి తల్లి తండ్రులకు బాగా చెప్పాడు. శివానందం చెల్లెలు, రాధ పన్నెండేళ్ళది. రజస్వలాంతర వివాహాలు అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి కాని శివానందం తల్లిదండ్రులు బాగా సంప న్నులు కావటం చేత పేదలకు కాస్త వెనకగా ఉండవలసిన వాళ్ళయ్యారు.

తన పెళ్ళి చూపులు అయిపోయాయని రాఘవుడికి తెలియదు. "ఇది మా చెల్లెలు రాధ" అని శివానందం తన చెల్లెలిని చూపించటం, రాధ కొద్దిగా సిగ్గు పడటమూ చూసినాక ప్రపంచంలో వున్న ఆడపిల్ల లందరికన్నా ఆ పిల్ల కొంచెం ప్రత్యేకంగా రాఘవుడికి అనిపించింది. రాధ ప్రత్యేకించి అందగత్తెకాదు. సంసార పక్షం. అయితే రాఘవుడికి అందం తెలిసినా అందంపట్ల స్వార్ధం లేదేమో.

అటు తర్వాత శివానందం తండ్రి రాజగోపాలం గారికి, మా రామకిష్టయ్య గారికి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. పెళ్ళి ఖాయమయింది. "మీ వాడి చదువు గురించి మీరేమి శ్రమపడనవసరం లేదు. నేను వాడిచేత ఇంజనీరింగ్ పాస్ చేయిస్తాను. అవకాశం వుంటే ఇంగ్లండు కూడా పంపిస్తాను. జర్మనీ అయితే బాగుణ్ణు. కాని అక్కడ నాజీల గొడవ మరీ జాస్తిగా ఉన్నది." అని రాజగోపాలం అన్నమీదట రామకిష్టయ్య కట్నాల ప్రసక్తి కూడా తీసుకురాలేదు.

పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. రాజగోపాలం అన్నమాట నిలబెట్టుకొని శివానందంతోపాటు రాఘవుణ్ని కూడా ఇంజనీరింగులో తన ఖర్చుతో చేర్పించాడు.

రాఘవుడి విషయంలో తన కృషి నూటికి నూరుపాళ్ళు సఫలమైనదని రామ కిష్టయ్య అనుకున్నాడు. మా అందరితో అన్నాడు కూడానూ. వాడి చదువు మాట అట్లా ఉంచి ఇంటరు చదువుతూండగానే రాజగోపాలం లాటి ఐశ్వర్యవంతుణ్ని

ఆకర్షించి అల్లుడు కాగలిగాడంటే అది తన ప్రయోజకత్వమేనని ఆయన అనుకొని ఉండవచ్చు. దానికి అభ్యంతరం చెప్పేవారూ ఉండరు.

4

ఇక రామకిష్టయ్య దృష్టి రామ్మూర్తిమీద కేంద్రీకరించవలసిన సమయం వచ్చింది. అప్పటికి వాడు స్కూలు ఫైనలు దాకా వచ్చాడు. అప్పటికే వాడు కొద్దిగా పట్టా తప్పాడు. ఎందుచేతనంటే ఫిఫ్త్ ఫారంలో వాడికి లెక్కల్లో సీట్లు ఇవ్వమనేసారు. అందుచేత హిస్టరీ సెక్షనులో చేరాడు. వాడు ఇంజనీరు గాని, డాక్టరుగాని అయ్యే అవకాశం లేదు. అప్పటికి రామకిష్టయ్య వాణ్ని లెక్కల గురించి హెచ్చరించాడు.

"నాకు లెక్కలు రావులే నాన్నా!" అని రామ్మూర్తి ఖచ్చితంగా చెప్పేసాడు.

వాణ్ని బారెట్లా చదివించే అవకాశం ఉంటుందేమోనని రామకిష్టయ్య ఆశ పడ్డాడు. వేళాకోళాని కన్నట్లుగా "వీడికి కూడా డబ్బుగల మామగారు వచ్చి ఏ ఇంగ్లండో పంపిస్తే బాగానే ఉండును." అని ఒకసారి అన్నాడు కూడాను.

రామ్మూర్తి ఇంటరు చదువుతుండగా పెళ్ళి సంబంధాలు వచ్చాయి. ఒక్కటి కూడా చెప్పుకోదగిన సంబంధం కాదు. వచ్చిన వాటిలో ఏదో ఒకటి చేద్దామా అని రామకిష్టయ్య అనుకున్నాడు. వాడి పెళ్ళికివచ్చే కట్నంతో వాడి చదువు వెళ్ళమారి పోతే తనకూ కొంత తేలికగా ఉంటుందని ఆయన ఉద్దేశం.

అయితే రామ్మూర్తి పెళ్ళాడనని మొరాయించాడు. కారణం వాడు ఎవరి తోనూ చెప్పలేదు మంచి మాటలతో నేను రాబట్టగలిగాను. రాజగోపాలం గారికి ఇంకోపిల్ల ఉన్నది. దాన్ని తనకిస్తారేమోనని రామ్మూర్తి ఆశపడ్డాడు. కాని రాజగోపాలం అలాటి అభిప్రాయం ప్రకటించనే లేదు. రామ్మూర్తికి చాలా కోపం వచ్చింది.

రామ్మూర్తిని బి. ఎల్. దాకా రామకిష్టయ్య తన సొంత ఖర్చుతోనే చదివించ వలసి వచ్చింది. ఖర్చు కూడా ఆయన అనుకున్న దానికన్నా జాస్తి అయ్యింది. దానికి కారణం రామ్మూర్తి ఖర్చుమనిషి. వాడి పెద్ద ఖర్చు బట్టలు.

"పట్నంలో కాస్త స్మార్టుగా ఉండాలి నాన్నా, అందులో లా కాలేజీ అంటే మరీనూ!" అనేవాడు రామ్మూర్తి.

వాడి స్మార్టునెస్ మార్కులు తేలేదు. ఎఫెల్లోనే తప్పాడు. తప్పినందుకు రామ్మూర్తి అట్టే బాధపడలేదుగాని రామకిష్టయ్య అవమానంతో కుంగిపోయి మంచం పట్టినంత పని చేశాడు.

"ఛీ, వెధవ! వీడికింక చదువు రాదు. మానిపించేస్తాను" అన్నాడు ఆయన. కాని ఆ పని చేయటానికి ఆత్మాభిమానం అడ్డువచ్చింది. ఇంత దూరంవచ్చి వెనక్కు తీస్తాడా ?

రామ్మూర్తి చదువు కొనసాగింది. ఖర్చుకూడా కొనసాగింది.

"వీడి చదువుకింద ఖర్చయినదంతా వీడి పెళ్ళికి రాబట్టాలి. లేకపోతే మిగిలిన పిల్లల చదువులు దెబ్బతింటాయి. నేనేమన్నా లక్షాధికారినా ?" అన్నాడు రామకిష్టయ్య.

కాని అక్కడకూడా ఆయన అనుకున్నట్లు జరగలేదు.

రామ్మూర్తి బి. ఎల్. పాసయ్యాక ఎన్‌రోలయ్యి లక్ష్మీనారాయణగారనే ఎడ్వొకేటు దగ్గిర పని నేర్చుకొంటూ ఆయన కుమార్తెను పెళ్ళాడవలసిన పరిస్థితి కలిగించుకున్నాడు. పెళ్ళి ముహూర్తం నిశ్చయమయ్యాక గాని రామకిష్టయ్యకు తెలియలేదు.

పెళ్ళికి వెళ్ళిన రామకిష్టయ్య కుటుంబానికి గొప్ప మర్యాదలయినా జరగలేదు.

రెండో కొడుకు కోసం అప్పటికే చాలా ఖర్చు చేసిన రామకిష్టయ్య రామ్మూర్తితో "ఇక నీ రెక్కలమీద నీవు ఆధారపడటం మంచిది" అని చెప్పి వచ్చేశాడు.

రామ్మూర్తి చెడిపోయినా దనటానికి లేదు. బాగుపడ్డాడనే చెప్పాలి. అతని భార్యకు కొంత ఆస్తి కూడా ఉన్నది. అదీగాక ఆమెకు రామ్మూర్తి మీద ఉత్త వ్యామోహమే గాక కొంత అభిమానం కూడా ఉన్నట్టు కనబడుతుంది. పెళ్ళినాటికే ఆమె బియ్యే పరీక్షకు కూర్చున్నది. తరవాత ఆమె బి. టి. చదివి, ఏదో కాన్వెంటులో టీచరుగా చేరింది. తన తండ్రి తన భర్తను తగినంత గౌరవంగా చూడటం లేదని ఆమె వేరే ఇల్లు తీసుకుని వేరే కాపరం పెట్టింది. రామ్మూర్తికూడా ఉద్యోగం సంపాదించాడు. వాళ్ళు ఏలోటూ లేకుండా నిక్షేపంగానే జీవించారు.

కాని రామకిష్టయ్య పడిన శ్రమకు మాత్రం ప్రతిఫలం ముట్టలేదు.

5

రాఘవుడు ఇంజనీరింగ్ పూర్తిచేసే సరికి ప్రపంచ యుద్ధం[1] వచ్చి కొంత కాలం అయ్యింది. అందుచేత వాడు విదేశాలకు వెళ్ళే అవకాశం కలగలేదు. ఎక్కడో బొంబాయిలో మెటల్ ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించాడు. భార్యతోసహా అక్కడే కాపరం పెట్టాడు. జీతం బాగానే వస్తూ ఉండి ఉండవచ్చు. కాని తండ్రికి ఏమి పంపించలేదు. ఎప్పుడన్నా ఒక ఉత్తరం రాస్తే అందులో తన భార్య గురించీ, బిడ్డ

---

1. రెండవ ప్రపంచ యుద్ధం (1939-1945) ప్రస్తావన. చూడు పేజి 139.

లను గురించి రాసేవాడు. డబ్బు కావాలా అని అడిగేవాడు కాడు.

"మీ వాడిప్పుడు బొంబాయిలో బాగానే ఉన్నట్టున్నాడే. సిమ్లాకూ, ఆగ్రాకూ, మౌంట్ అబూకూ ఈ మధ్య సకుటుంబంగా వెళ్ళివచ్చాట్ట. ఇంటికేమన్నా పంపు తున్నాడా ?" అని ఎవరో అంటే రామకిష్టయ్యగారి మొహం జేవురించింది.

"వాడు డబ్బు పంపకపోతే నాకు గతిలేదా ఏం ?" అని అడిగాడు.

తన కొడుకు అత్తవారి మనిషి అయిపోయాడనీ, వాళ్ళు వాడికి పెద్దెత్తుగా జీవించే పద్ధతులు చెప్పారనీ, అందుకే పిల్లను తక్కువ చోటినుంచి చేసుకోమంటా రనీ, ఇప్పుడనుకుని లాభంలేదనీ ఆయన అంటూ వచ్చాడు.

"లేదు లెండి. వాడికి పెద్ద ఉద్యోగం రావటంతో కళ్ళు నెత్తికెక్కాయి. ఇప్పుడు మనం వాడికి కనిపించం." అన్నది అతని భార్య.

నిజానికి ఆ రోజుల్లో రామకిష్టయ్య పెద్దగా డబ్బుకు ఇబ్బంది పడను కూడ లేదు. ఆ స్థితి తరవాత చాలా రోజులకు ఏర్పడింది.

"ఈ లోపల మూడోవాడు నారాయణ చదువు మానేశాడు. వాడికి చదువు అంతగా అంటలేదు-కాని కమ్యూనిస్టు సాహిత్యం బాగా అంటింది. జీవితంలో ప్రతి దాన్ని గురించి శంకించిన వాడి బుర్రకు మార్క్సిజం సూటిగా తగిలింది. మార్క్స్[2] సిద్ధాంతాలలో ఏలాటి కాపట్యమూ ఉండే అవకాశంలేదని వాడికి గురి కుదిరిపోయింది. జీవితంలో ఉండే వంచనను నారాయణ ఊహించుకున్న దానికన్నా కూడా మార్క్సిస్టు సాహిత్యం బట్టబయలు చేసింది. మార్క్స్ చెప్పిన సూత్రాల మీద రష్యాలో ఒక సమాజం ఏర్పడిందని, అందులో కోటీశ్వరులు అందలాలెక్కి తిరగటానికీ, కటిక దరిద్రులు ముష్టెత్తటానికి అవకాశాలు లేకుండా పోయాయని

---

2. కార్ల్‌మార్క్స్ (1818-1883) "తాత్వికులు యింతకాలం ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించడం మాత్రమే చేశారు. అసలు చేయాల్సింది దాన్ని మార్చడం" అని నిర్ధారించిన భౌతికవాది, చరిత్రకారుడు, ఆర్థిక సిద్ధాంతకారుడు. ఆయన ప్రతిపాదించిన ప్రాపంచిక దృక్పథం మార్క్సిజం. అందులోని మూలాలు : గతితార్కిక భౌతికవాదం; చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథం, వర్గపోరాటం; విలువ, అదనపు విలువ, సోషలిజం, కమ్యూనిజం. ఆచరణే సిద్ధాంత జీవమనీ, సిద్ధాంతం ఆచరణకు మార్గదర్శకమనీ నమ్మి ఉపదేశించి, ఆచరించి, అంతర్జాతీయ శ్రామికవర్గ వుద్యమానికి పునాదులు వేసిన వర్గపోరాట యోధుడు.

కమ్యూనిస్టు ప్రణాళిక (1848), పెట్టుబడి (మూడు సంపుటాలు 1867, 1885, 1894) మొదలైన రచనలు ఈ శతాబ్ది చరిత్రను కొత్త ప్రపంచంలోకి మలుపుదిప్పిన రచనలు, ఫ్రెడరిక్ ఎంగెల్స్ (1820-1895) మార్క్స్ సహయోధుడు, మిత్రుడు, సహరచయిత.

వాడు నమ్మగలిగాడు. విప్లవం, శ్రామికవర్గ నియంతృత్వం. మొదలయిన మాటలతో వాడి బుర్ర వెలిగిపోయింది. ఆ వెలుగులో వాడు అతి మనోహరమైన జీవిత విధానాలను రూపొందించుకున్నాడు.

వాడు కమ్యూనిస్టుల వెంట తెగ తిరిగాడు. మామూలు మనుషుల్లో కనిపించే దాపరికమూ, స్వార్థమూ, మోసమూ వాడికి కమ్యూనిస్టుల్లో కనపడలేదు. వాళ్ళకు రెండు నాలుకలూ, రెండు గుండెలూ లేవు. వాళ్ళలో ధైర్యమున్నది. వాళ్ళతో స్నేహంగా ఉండటం తేలిక.

మార్క్సిజం గురించీ, కమ్యూనిస్టులను గురించీ ఇలాంటి సదభిప్రాయాలన్నీ ఏర్పడిపోయాక, వాడు కమ్యూనిస్టులతో తిరిగి ఎందునా కాకుండా చెడిపోతున్నట్టు రామకిష్టయ్యకు తెలిసింది.

"ఒరే ఆ పనికిమాలిన కమ్యూనిస్టులతో ఎందుకు తిరుగుతావురా? వాళ్ళు తోక తెగిన నక్కలు! ఏవేవో నినాదాలు పట్టుకొని, పిడుక్కూ, బియ్యానికీ వాటినే వల్లె వేస్తారు. వాళ్ళకు కావలసింది అరాజకం" అని మధ్యతరగతి గృహస్తు చెప్పవలసిన నీతులేవో రామకిష్టయ్య నారాయణకు చెప్పాడు.

నారాయణ తండ్రికేసి వింతగా చూశాడు. తన తండ్రి అంత అజ్ఞాని అని నారాయణకు అంతకుముందు తెలియదు. నిజానికి రామకిష్టయ్య ఒక పొరపాటు చేశాడు. ఆయన కమ్యూనిస్టులను గురించి ఏమి తెలియకుండానే కొంత తెలిసినవాడితో మాట్లాడడు. కమ్యూనిస్టులను గురించీ, మార్క్సిజం గురించీ తెలుసుకోవలసినది ఏమీ లేదని ఆయన గట్టిగా నమ్మాడు. ఈ పొరపాటే దేశంలో చాలా మంది మధ్యతరగతి గృహస్తులు చేసి తమ పిల్లల విశ్వాసాన్ని సొంతం పోగొట్టుకున్నారు. మార్క్సిస్టు సిద్ధాంతాలలో లోపాలే ఉండవచ్చు. కమ్యూనిస్టుల ఆశయాలు తప్పుడువే అయి ఉండవచ్చు. కాని ఆ లోపాలేవో, తప్పేమిటో రామకిష్టయ్యకు బొత్తిగా తెలీదు.

తన తండ్రి ఒక్క ముక్కతో కొట్టిపారేసిన కమ్యూనిస్టులు బోలెడంత సాహిత్యం అచ్చేశారు. దళాలను ఏర్పాటుచేసి కళాస్వరూపాలను ప్రచారం చేశారు. బొంబాయిలో వాళ్ళకు ఎంతో పలుకుబడి ఉంది. నారాయణ బొంబాయి వెళ్ళి నెల రోజులున్నాడు. కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు బ్రిటిష సైనికుల దగ్గిర నుంచీ రావటమూ, సినిమా స్టార్లు దగ్గిర నుంచీ వాళ్ళకు ఎంతో ప్రోత్సాహం లభించటమూ కళ్ళారా చూశాడు. ఏదో పెద్ద మిల్లు, పార్టీ నిధికి విరాళాలు కూడా ఇచ్చేదని విన్నాడు నారాయణ. ఇందులో నూరోవంతు కూడా తన తండ్రికి తెలియకపోవటం నారాయణకు తలచుకున్నప్పుడల్లా ఆశ్చర్యంగా ఉండేది.

కమ్యూనిస్టుల సంపర్కం నారాయణకు ఒక సద్యఃఫలితాన్ని ఇచ్చింది. ఫిఫ్త్ ఫారంలో ఇంగ్లీషులో నూటికి 25 మార్కులు తెచ్చుకొని తప్పిన వాడు మార్క్సిస్టు పుస్తకాలను ఇంగ్లీషులో చదివి అర్థం చేసుకునే స్థితికి రెండేళ్ళలో వచ్చాడు. వాడి

జీవితానికి అవే అసలైన పాఠ్యపుస్తకాలయాయి. వాడు క్లాసులో చదువుకున్న పుస్త కాలలో ఉన్నదేమిటి? అదంతా వాడికి అవిద్య అనిపించింది.

యుద్ధం చివరి రోజులలో నారాయణకు, చరిత్రకు మూలాధారం ఇకమీదట కమ్యూనిస్టులు తప్ప మరొకరు కాలేరనీ, కావటానికి వీలుకూడ లేదనీ అనిపించింది. యుద్ధం ముగిసిన ఏడాది లోపల మనదేశంలో కమ్యూనిజం వచ్చేస్తుందని వాడు ఎందరితోనో అన్నాడు.

6

యుద్ధం అయిపోయింది. రాఘవుడి ఉద్యోగం కూడా అయిపోయింది.

నావికుల తిరుగుబాటు[1] కీర్తిని పటేలు[2] గారు కాంగ్రెసు బుట్టలో వేసు కున్నప్పటికి, ప్రజలకు కమ్యూనిస్టులతో పనితీరినట్లు కనపడలేదు. అయితే చీకటి వ్యాపారాలు చేసేవాళ్ళకు కమ్యూనిస్టులు పానకంలో పుడకల్లాగా అడ్డుపడ్డారు. అతిసామాన్య మధ్యతరగతి వాళ్ళలో కూడా కమ్యూనిస్టులంటే చాలా అసహ్యం పుట్టింది.

"పండగనాడు పస్తుండమంటా రేమిటయ్యా ఈ కమ్యూనిస్టులూ? ఇప్పుడే నాలుగు డబ్బులు చేసుకోకపోతే ఆ తరువాత ఈ అవకాశం వస్తుందా?" అని నాతోనే కొందరన్నారు.

"వాళ్ళు రాబోయే కమ్యూనిజంకు అలికి ముగ్గులు పెడుతున్నట్టున్నారు" అన్నాను.

"క్వినైను లాభానికి అమ్ముకుంటే బెదిరిపోయే కమ్యూనిజం, అదెంత కమ్యూ నిజమయ్యా?"

---

1. నావికుల తిరుగుబాటు (18-23 ఫిబ్రవరి, 1946): జాతి వివక్షపట్ల, పని పరిస్థితుల పట్ల అసంతృప్తి చెందిన రాయల్ భారత నౌకాదళం చేసిన తిరుగుబాటు. బొంబాయిలోని సిగ్నల్ శిక్షణా కేంద్రం తల్వార్‌లో ఫిబ్ర వరి 17 వ తేదీ నిరాహారదీక్షతో మొదలైన అసంతృప్తి 18 వ తేదీకి సమ్మె రూపం తీసుకుంది. కరాచీ, కలకత్తా, విశాఖ మొదలైన అన్ని నౌకా కేంద్రా లకు విస్తరించింది. సమ్మె కమిటీ ఏర్పాటుతో రాజకీయ డిమాండ్లు కూడా ముందుకొచ్చాయి. బ్రిటిష్ పతాకాల స్థానంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు, ముస్లింలీగు పతాకాలు నౌకలపై సమ్మెదారులు ఎగురవేశారు, సమ్మె జరి పారు. సమ్మెను అణిచేందుకు ప్రభుత్వం సైన్యాన్ని పంపింది. భారతీయ సైనికులు నావికులపై కాల్పులు జరిపేందుకు నిరాకరించారు. బ్రిటిష్ పటా లాలు దిగాయి. కాజిల్‌రాక్ నౌకా కేంద్రంవద్ద ఫిబ్రవరి 21వ తేదీ 7 గంటల

నాకు మాత్రం ఏం తెలుసు ?

ఉద్యోగం అయిపోగానే గుజరాతీలు ఇచ్చిన కాంపెన్సేషన్ చెక్కు జేబులో పెట్టుకుని రాఘవుడు అత్తవారిల్లు చేరాడు. అప్పటికి వాడికి ఇద్దరు పిల్లలు. వాళ్ళనింకా మా రామకిష్టయ్య చూడలేదు.

రామ్మూర్తికి కూడా ఒక ఆడపిల్ల. దాన్ని రామకిష్టయ్య చూడలేదు.

నారాయణ బొంబాయిలోనే ఉండిపోయాడు. వాడు ఏ విధంగా పొట్టపోసుకుంటున్నదీ ఎవరికీ తెలీదు. తిండికి మాడకుండా ఉంటే అదే చాలు. పొట్టపోసుకునే ప్రతిమార్గమూ సజావైనదే - ఉపవాసమనేది తలవాకిలి దగ్గిర తిష్టవేసి ఉన్నప్పుడు.

ఈ లోపల కోదండరాముడు తండ్రి వేసిన పట్టాలమీద సక్రమంగా నడిచాడు. వాడు మెడిసిన్ చదివాడు. పదివేలు కట్నం తీసుకుని పెళ్ళి కూడా చేసుకున్నాడు. రామకిష్టయ్య మహా సంతోషించాడు. ఇంత కాలానికి తన కొడుకు జమా పద్దు చూపగలిగాడు. కట్నం పదివేలలో రెండువేల చిల్లర దానికీ దీనికీ ఖర్చయింది. కోదండరాముడి పెళ్ళినాటికి దాదాపు బికారి అయి ఉన్నాడేమో, రామకిష్టయ్యకు ఏడువేల రూపాయలు లక్షరూపాయలల్లే కనపడింది.

అయితే అదీ దక్కలేదు. "నాకు ఉద్యోగం చెయ్యాలనిలేదు నాన్నా. మిగిలిన డబ్బుతో క్లినిక్ పెట్టుకుంటాను." అన్నాడు కోదండరాముడు.

రామకిష్టయ్య ఎట్లా కాదంటాడూ? కట్నం బేరమాడి తెచ్చుకున్నది కోదండ

పాటు పోరాటం జరిగింది. బేషరతుగా లొంగకపోతే నౌకాదళాన్ని నాశనం చేస్తానని నౌకాదళాధిపతి గాడ్ఫ్రే బెదిరించాడు. 22వ తేదీ కమ్యూనిస్టు పార్టీ పిలుపుపై బొంబాయిలో సార్వత్రిక సమ్మె జరిగింది. ఈ సమ్మెను పటేల్ వ్యతిరేకించాడు. బ్రిటిష్ సైనికులు కార్మికులపై కాల్పులు జరిపి మూడు వందలమందిని పొట్టనబెట్టుకున్నారు. పటేల్, జిన్నాలు బేషరతుగా లొంగిపోతే, పగ సాధింపు చర్యలు లేకుండా చూస్తామని నావికులకు సలహా ఇచ్చారు. "మేము భారతదేశానికి లొంగిపోతున్నాం కానీ, బ్రిటిష్ ప్రభుత్వానికి కాదు" అని నావికులు 23వ తేదీ సమ్మె విరమించారు. ఈ సమ్మె సమయంలో అపూర్వమైన ప్రజా సహకారం నావికులకు లభించింది. "ఆర్. ఐ. ఎన్. ఉదంతం భారత సైన్యాల చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభించింది." అని జవహర్లాల్ నెహ్రూ భావించాడు.
(వివరాలకు చూడు. **Subrata Banarjee, The RIN Strike, People's Publishing House : New Delhi, 1981 Reprint.**)

2. పటేల్ (1875-1950) : **వల్లభాయిపటేల్.**

రాముడు. ఆ కట్నాన్ని తన కుటుంబం కోసమే వినియోగిస్తానని కూడా వాడు తన భార్యకు మాట ఇచ్చాడు.

వాడా క్లినిక్కును ఉన్న ఊళ్ళోనే పెట్టుకున్నా రామకిష్టయ్యకు కొంత అనుకూలంగా ఉండేది. వాడు దాన్ని మద్రాసు పట్నంలో నెలకొల్పాడు. అక్కడ వాడి క్లాస్‌మేట్ సర్జను ఒకడున్నాట్ట. ఇద్దరూ కలిసి క్లినిక్ నడుపుతారుట. వాడు కూడా తన మామగారిచ్చిన కట్నంతోనే ఆపరేషన్ థియేటరొకటి ఏర్పాటు చేస్తున్నాట్ట. ఇంత పెద్ద స్కీముకు రామకిష్టయ్య ఎట్లా అభ్యంతరం చెబుతాడూ ?

కోదండం సంగతి ఆ విధంగా అయింది. కొత్తగా ప్రాక్టీసు పెట్టిన ప్లీడరూ, డాక్టరూ ఎప్పటికి ఒడ్డున పడేది ఎవరూ చెప్పలేరు. కొందరికి చప్పున ప్రాక్టీసు అందుకుంటుంది. కొందరికి ఎంతకూ అందుకోదు. అదంతా వాళ్ళ వాళ్ళ ముఖారవిందాలమీదా, చాకచక్యం మీదా, కొంతవరకు వృత్తిలో వాళ్ళకుండే నైపుణ్యంమీదా ఆధారపడుతుంది.

7

ఇక ఆశలు పెట్టుకోవటానికి రామకిష్టయ్యకు గోవిందుడొకడు మిగిలాడు- ఆయనకింకా కొడుకులమీదా ఆశలు పెట్టుకునే శక్తి ఉంటే.

"మనకన్న పక్షులు నయం. పిల్లలకు రెక్కలొచ్చేదాకా అన్ని రకాలా సహాయం చేస్తాయి. రెక్కలొచ్చిన పిల్లలు తమను ముసలితనంలో ఆదుకోవాలని ఆశించవు. పక్షి పిల్లలకూ్కడ, తమ తల్లిదండ్రుల గతేమిటా అన్న విచారం ఉండదు. ఆ విచారం మనిషి పిల్లలకూ ఉండటం లేదనుకో. కాకపోతే మనిషి పెద్దలకు పిల్లల మీద ఆశలు పెట్టుకోకుండా జరగటం లేదు. ఇక్కడే మనుషులకూ పక్షులకూ పెద్ద తేడా ఉంటున్నది" అనేవాడు రామకిష్టయ్య.

నేనూ ఒకప్పుడు ఆయనను మెచ్చుకున్నవాణ్ణే. ఆయన స్థితిలో ఉన్న వాడెవడూ తన పిల్లలు పైకివచ్చే సదుపాయాలు ఆ విధంగా చెయ్యడు, చెయ్యలేడు. "తండ్రి అంటే అట్లా ఉండాలి!" అని నేను ఎన్నిసార్లు అని ఉంటానో!

కాని నాకు ఆవిషయం ఇప్పుడు సందేహమే. రామకిష్టయ్య అవాస్తవికంగా ప్రవర్తించాడేమో. ఒక్క ఆడపిల్ల పెళ్ళి చేసి గొప్ప సంబంధం తీసుకురావటానికై దివాలా తీసిన వాళ్ళను నేనెరుగుదును. అంతెత్తు ఎగిరి మక్కెలు విరగ్గొట్టుకోవాలా?

ఆర్థికంగా ఎవడి స్థాయి వాడికుంటుంది. ఈ స్థాయిలను వ్యక్తులు మార్చేది కల్ల. ఎవడి స్థాయిలో వాడుంటేనేం? సినిమా కథలో రిక్షావాడి కొడుకు కలెక్టరు కావచ్చునేమో. నిజమైన జీవితంలో రిక్షాలు లాగేవాడి కొడుకు కారు డ్రైవరయితే స్థాయి పెరిగినట్టు కాదా? కన్ను పోయినంత కాటుకెందుకని!

రామకిష్టయ్య చేసిన తప్పు స్పష్టంగా తెలిసి వచ్చేటట్టు చేసినవాడు గోవిందుడు. నిజానికి వాడు తండ్రిపైన అట్టే ఆధారపడలేదు. ఆ మాటకొస్తే తండ్రే వాడిపైన ఆధారపడవలసిన స్థితిలో ఉన్నాడు. అంతేకాదు; వాడైనా దబ్బున చదువు పూర్తిచేసి నాలుగురాళ్ళు తెస్తే బాగుండునన్న ధోరణిలోకి వచ్చాడు రామకిష్టయ్య.

కాని గోవిందుడు లేడిలాగా గెంతుతూ చదువులో ముందుకు పోయాడు. వాడు ప్రతిక్లాసు ఫస్టుక్లాసు మార్కులతోనే పాసయ్యాడు. స్కాలర్‌షిప్పులు తెచ్చుకున్నాడు. న్యూక్లియర్ ఫిజిక్సు తీసుకున్నాడు. రిసెర్చి చేసి అందులోనే డాక్టరేట్ కూడా సంపాదించాడు. వాడి ఫోటో పేపర్లలో పడింది. ట్రాంబేలోనే పెద్ద ఉద్యోగం దొరికింది.

ఆ మధ్యను గోవిందుడు వస్తే కలిశాను. వాడు పెద్ద స్కీములతో ఉన్నాడు. బొంబాయిలో స్థలం తీసుకున్నాట్ట. ఇల్లు కట్టాలిట. కారు కొనాలిట. తను ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఏమీ బాగాలేదుట. అయిదురూముల ఫ్లాట్‌ట. రిఫ్రిజిరేటరూ, ఏర్ కండిషనింగ్ ప్లాంటూ అన్నీ ఏర్పాటు చేసుకున్నాట్టగాని, ఇల్లే తనకు నచ్చలేదుట. తాను కట్టబోయే ఇంట్లో కనీసం నాలుగు బెడ్‌రూములైనా ఉండాలిట. ఫర్నిచరుకే యాభైవేల రూపాయలవుతుందిట. ఇల్లు దొరలక్కూడా అనుకూలంగా ఉండాలిట.

అంతా విని, "ఇవన్నీ మీనాన్న ఊహించనుకూడా లేడు" అన్నాను.

"మా నాన్నకు లైఫ్‌మీద ధ్యాస ఎక్కడున్నది?" అన్నాడు వాడు.

"ధ్యాస ఉన్నంత మాత్రాన ఏమవుతుందిలే? మీ అన్నదమ్ముల చదువుల మీద మీనాన్న చాలా ధ్యాస పెట్టాడు. అందువల్ల ఆయనకు ఒరిగిందేమిటి?" అన్నాను

గోవిందుడు కాస్త ఆలోచించి, "అఫ్‌కోర్స్. ఆయన మా చదువు గురించి చాలా శ్రద్ధ కనబరిచాడు.... కాని మళ్లా ఆయనతో అనొద్దు. నేను ఇంటర్ పాసు కాగానే నన్ను ట్రైనింగయి మన స్కూల్లోనే టీచరుగా చేరమన్నాడు! ఆయన మాటవింటే ఇప్పుడు నేనెక్కడ వుండేవాణ్ణి" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

చివరకు రామకిష్టయ్యకు కొడుకులిచ్చిన కితాబు, నాకు తెలిసినంతవరకు, ఇదే!

ముద్రణ : యువ దీపావళి సంచిక, 1968